
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



చేనేతల మృతిపై ఎన్నెన్నో అనుమానాలు



తల్లిదండ్రులను కోల్పోయి దుఃఖంలో ఉన్న మృతుడు సుబ్బరాయుడు పెద్దకుమార్తె లక్ష్మీప్రసన్న



పాల వెంకటచలపతి పేరుతో ఉన్న పట్టాదారు పాస్‌బుక్కు

- పాల చలపతి పేరుతోనే పాస్‌బుక్కు, టైటిల్‌డీడ్
- మరి ఆ భూమి ఏమైనట్లో...?
- రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉంది : తహసీల్దార్
- అప్పుల బాధతోనే ఆత్మహత్యలు : డీఎస్పీ షరీఫ్
- మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం
- ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు

ఒంటిమిట్ట, మార్చి 24: నిండు ప్రాణాలకు వెలకట్టేది ఎవరు... చేనేతల మృతిపై ఎన్నో అనుమానాలు... ఎన్నో సందేహాలు నెలకొన్నాయి. బాధితులకు న్యాయం చేసేది ఎవరు..? ఈ ప్రశ్న ఇప్పుడు అందరిలో నెలకొన్న సందేహం. బాధితుల భూమికి సంబంధించి పాస్‌బుక్కు, టైటిల్‌డీడ్ వారి పేరుతోనే ఉన్నాయి. మరి ఆ భూమి వేరే వారి పేరుతో ఆన్‌లైన్ ఎలా అయింది.. ఇందులో ఎవ రెవరు ఉన్నారో నిర్ధారించాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు. పోలీసులు మాత్రం వారు భూమి కోసం ఆత్మహత్య చేసుకోలేదని, అప్పుల బాధతోనే చేసుకు న్నారని చెబుతుండటం గమనార్హం.

మండలంలోని కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, భార్య పద్మ, కూతురు వినయ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తమ భూమి ఇతరుల పేరుతో ఆన్‌లైన్ అయిందని, ఆ భూమి తనకు దక్కదన్న నిరాశతో ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో వివరించారు. మరి బాధితుల మాట నిజమా.. విచారించే పోలీసుల మాట నిజమా, ఎవరి మాట నిజమనేది ఇప్పుడు అందరి మనసులను తొలుస్తున్న ప్రశ్న. మండలంలోని రెవెన్యూ అధికారులు హడావుడిగా పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. పాల సుబ్బారావు కుటుంబానికి, వారి వారసులకు గానీ ఎలాంటి భూమి లేదని, సుబ్బారావు ఆరోపిస్తున్న భూమంతా ప్రభుత్వ భూమి అని తహసీల్దార్ వెంకటరమణ పేరుతో ప్రెస్‌నోట్‌ను స్థానిక రెవెన్యూ అధికారులు ఆదివారం విడుదల చేశారు. మరి 2015లో పాల చలపతి పేరుతో ఆన్‌లైన్ చేసింది ఎవరు..? చేయించింది ఎవరు..? అనంతరం ఆన్‌లైన్ నుంచి తీసిందెవరు అనే మాటకు మాత్రం సమాధానాన్ని అధికారులు చెప్పడం లేదు. పాల వెంకటచలపతి పేరుతో 1712 ఖాతా నెంబరులో పాసుబుక్కు, టైటిల్ డీడ్‌ను రెవెన్యూ అధికారుల రాజముద్రలతో కూడిన పాస్‌బుక్కును కుటుంబసభ్యులు చూపిస్తున్నారు. మరి రెవెన్యూ అధికారులకు తెలియకుండా పాస్‌బుక్కు ఎవరు ఇచ్చారు, ఎవరు దానిని తయారు చేశారు, తామే సంతకాలు చేశారా.. రెవెన్యూ అధికారులకు తెలియకుండా పట్టాదారు పాసుబుక్ సామాన్య ప్రజలకు ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో సంచలనం కలిగించిన కేసును గంటల వ్యవధిలోనే తప్పుదోవ పట్టించి సమస్యను తుడిచి వేసే విధంగా ప్రెస్‌మీట్ నిర్వహించడం పట్ల పోలీసులపై విమర్శలు వస్తున్నాయి. రోజూవారీ రెక్కల కష్టంతో జీవనసం సాగించే ఆ కుటుంబానికి 50 లక్షల రూపాయలు అప్పు ఇచ్చింది ఎవరు, అప్పు ఇవ్వడానికి ఇతడి దగ్గర కోట్ల రూపాయల ఆస్తి ఏమైనా ఉందా అనే మాటకు మాత్రం పోలీసుల నుంచి సమాధానం రావడం లేదు. కుటుంబాన్ని పోషించడమే కష్టమై ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబం 50 లక్షల రూపాయలు అప్పు చేసిందన్న మాట సామాన్య ప్రజలు కూడా నమ్మడం లేదు. అంత అప్పు చేయడం ఆ కుటుంబానికి సాధ్యమా మరి ఇంత డబ్బులు ఉంటే కుటుంబ పోషణ ఎందుకు ఇబ్బంది అవుతుందన్న ప్రశ్న అందరి నోటా వినబడుతోంది. 50 లక్షల రూపాయలు అప్పులు చేశారనే విషయాన్ని పోలీసులు చెబుతున్నా.. అప్పు ఎవరిచ్చారు.. ఎప్పుడు ఇచ్చారు అనే మాటకు మాత్రం విచారణ చేపడుతున్నాం అని చెబుతున్నారే తప్ప వివరాలు మాత్రం చెప్పడం లేదు. ఏది ఏమైనా పేద కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని.. ఆ కుటుంబానికి న్యాయం చేసే విధంగా ఇటు అధికారులు, అటు రాజకీయ నాయకులు ప్రయత్నించాలని.. అధికార పార్టీ నాయకులకు, అధికారులకు తలొగ్గి వాస్తవాలను తొక్కిపెట్టే విధంగా ప్రయత్నించవద్దని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలను బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించారు. మృతదేహాలను చూసేందుకు మండల వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దహన సంస్కారాల్లో పాల్గొన్నారు.



పాల సుబ్బారావు కుమార్తె లక్ష్మీప్రసన్నతో ఫోన్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు, అతికారి దినేశ్

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

- మృతుల కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు
- నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి

అధికార వైసీపీ భూదాహానికి బలైన చేనేతల కుటుంబ సభ్యులను టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కుటుంబం ఆర్థికంగా స్థిరపడేంత వరకు టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారికి అన్నివిధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ నాయకుల అరాచకాలు, భూకబ్జాలతో ఓ కుటుంబాన్ని బలి తీసుకున్నారన్నారు. పాల సుబ్బారావు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, వైసీపీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

కుటుంబమే పోయింది... మా భూమి మాకు ఇప్పించండి

- లక్ష్మీప్రసన్న, పెద్ద కుమార్తె

మా కుటుంబం భూమి కోసం ఆత్మహత్యకు పాల్పడింది. ఆ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలి. మా తాత పేరుతో 3.10 ఎకరాలు ఉంది. అందుకు సంబంధించిన పాస్‌బుక్కు, టైటిల్‌డీడ్, దానికి సంబంధించిన కాగితాలు మా దగ్గరే ఉన్నాయి. మేము ఆరు సంవత్సరాల నుంచి భూమి కోసం తిరుగుతున్నాం. మా భూమి మాకు వచ్చే విధంగా న్యాయం చేయాలి. పీఎం కిసాన్ డబ్బులు కూడా రెండు సంవత్సరాలు మా అకౌంట్‌లో పడ్డాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి : తులసిరెడ్డి

మండలంలోని కొత్తమాధవరం గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని, ఘటనకు సంబంధించి విచారణను పారదర్శకంగా చేయాలని, ఘటనకు సంబంధించిన బాధ్యులు ఎంతటి నాయకులైనా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమిశెట్టి మనోహర్‌బాబు, చంద్రశేఖర్, సత్తార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఆర్డీవోలను సస్పెండ్ చేయాలి

- బాధితుల కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ.గఫూర్ డిమాండ్

కొత్త మాధవరంలో చేనేత కుటుంబాల ఆత్మహత్యల బాధితులను సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఎం బృందం కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పాల చలపతి సోమశిల మునక ప్రాంత వాసి అని ఒంటిమిట్ట మండలం రెవెన్యూ పొలం సర్వే నెంబరు 2187/2లో, ఖాతా నెంబరు 1712లో 3.10 ఎకరాలను ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని, పాస్‌బుక్, టైటిల్‌డీడ్ కూడా ఇచ్చారని తెలిపారు. 2015లో పీఎం కిసాన్ యోజన పథకం కింద లబ్ధిదారుడైన ఆ భూమిని అప్పట్లో ఒంటిమిట్ట తహసీల్దార్‌గా పనిచేసిన శిరీష, ఆర్డీవోగా పనిచేసిన వీరబ్రహ్మం కలిసి వైసీపీ నాయకుల భూకబ్జాలకు సహకరించి రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని సీపీఎం నాయకులు తెలిపారు. మండలంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అనుచరుడు కట్టా నారాయణ, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అనుచరుడు సుబ్బారెడ్డిల వద్ద భారీగా ముడుపులు తీసుకుని సుమారు 600 ఎకరాలకు పైగా ఒంటిమిట్ట మండలంలోని రెవెన్యూ రికార్డులలో పేదల భూములు తొలగించి అనర్హులకు ఎక్కించారని ప్రజలు సీపీఎం బృందానికి చెప్పినట్లుగా వారు తెలిపారు. ఇందులో నిజానిజాలను కలెక్టర్ విచారణ వేసి తేల్చాలని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి జిల్లాలో భూకబ్జా కారణంగా నిండు కుటుంబం ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను, తన సొంత పార్టీ నాయకులపై కేసు నమోదు చేయించి పేదల పక్షాన ఉన్నట్లుగా తన విశ్వసనీయతను నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఇలాంటి ఉదాంతాలు మరిన్ని జరిగే అవకాశం ఉందని, దీనికి బాధ్యత వైసీపీ ప్రభుత్వమే వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మోహన్, అన్వేష్, దస్తగిరి రెడ్డి, కోనేటి నరసయ్య, సురేష్‌బాబు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

అప్పులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు : డీఎస్పీ

మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో సంచలనంగా మారిన ముగ్గురు కుటుంబ సభ్యుల ఆత్మహత్య ఘటనపై ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ షరీఫ్, సీఐ పురుషోత్తంరాజుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తమాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడని, అందులో నష్టాలు రావడంతో పాటు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యాడని, ఆ కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. కుటుంబ సభ్యులకు విషద్రావణం తాగించారని డాక్టర్లు నిర్ధారించారని.. విషద్రావణం ఏది అనేది ఫోరెన్సిక్ పరీక్షలో తెలుస్తుందన్నారు. భార్య, కూతురుని చంపి సైకిల్‌పై ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకుని తెల్లవారుజామున వెంకటాద్రి రైలు కింద పడ్డాడని జీఆర్పీ లోకో పైలట్ డ్రైవర్ తెలిపారని ఆయన అన్నారు. వారు రాసిన లేఖలో తొమ్మిది లక్షల అప్పులు ఉన్నాయని తెలిపారని, కానీ తమ విచారణలో దాదాపు 40 నుంచి 50 లక్షలు అప్పు ఉన్నట్లుగా గుర్తించామని.. అది ఎవరికి ఉన్నారనేది ఇంకా నిర్ధారణ చేయలేదన్నారు. కడప ఆర్డీవో రెవెన్యూ అధికారులు 3.10 ఎకరాల భూమి బాధితుడి పేరు మీద ఎక్కడా ప్రభుత్వ భూమి లేదని, వారి కుటుంబ సభ్యులకు పట్టా ఇవ్వలేదని రెవెన్యూ వారు విచారించి తమకు నివేదిక ఇచ్చారన్నారు. 2015 సంవత్సరంలో ఎవరినో పట్టుకుని భూమి ఆన్‌లైన్‌లో చేసుకున్నాడని.. అది కూడా రెండు వారాల అనంతరం మళ్లీ తీసివేశారని.. అంతే తప్ప రెవెన్యూ రికార్డుల్లో కానీ ప్రభుత్వపరంగా గానీ, ఎలాంటి డాక్యుమెంట్లు లేవని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులు ఆరోపించినట్లుగా పీఎం కిసాన్ డబ్బులు కూడా వారికి పడలేదని రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు పరిశీలించి చెప్పారన్నారు. 2015లో ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులపై విచారణ చేపడుతున్నారని, విచారణలో అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ఎస్‌ఐ మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

ఎన్నికల కోడ్ పట్టదా..?

- పులివెందులలో అమలు కాని నిబంధనలు



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తొలగించని ముఖ్యమంత్రి, ఎంపీ ఫోటోలు

పులివెందులటౌన్, మార్చి 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు, సిబ్బంది ఆ దిశగా చర్యలు చేపట్ట లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల ఫొటోలు, బ్యానర్లు పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించిన సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంలో సీఎం ఫొటో ఉన్న శిలాఫలకం దర్శనమిస్తూనే ఉంది. అంతేకాకుండా సచివాలయ భవనానికి జగన్ ఫొటో కనిపించకుండా స్టిక్కర్ మాత్రమే వేసి సంక్షేమ పథకాలు కనిపించేలా వదిలేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రజాప్రతినిధులకు చెందిన ప్రచార ఆర్భాటాలు, వారి ఫొటోలు తొలగించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు విమర్శి స్తున్నారు.


నియామకాలను సస్పెండ్ చేసిన హైకోర్టు

ప్రొద్దుటూరు, మార్చి 24: ఎస్పీడీసీఎల్ ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని కొర్రపాడు రోడ్డు, ఖాదరబాదర, పవర్‌హౌస్ సబ్‌స్టేషన్లలో కాంట్రాక్ట్ బేస్ కింద నియమించిన షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాలను రాష్ట్ర హైకోర్టు సస్పెండ్ చేసింది. ఇప్పుడు పనిచేస్తున్న షిఫ్ట్ లైన్‌మెన్లను యథావిధిగా కొనసాగించాలని ఈనెల 21న ఉత్తర్వుల్లో పేర్కొంది. శనివారం ఆంధ్రజ్యోతి పత్రికలో విద్యుత్‌శాఖలో అడ్డగోలు నియామకాలు అనే వార్త కథనం ప్రచురితమైంది. ఈ అక్రమ నియామకాలకు మార్చి 9న సీఎండీ, మార్చి 10న డివిజన్ ఈఈ శ్రీనివాసులరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. అనారోగ్యం, వయోభారం, వికలాంగత్వం లాంటి సమస్యలున్న 12 మంది షిఫ్ట్ లైన్‌మేన్లు సంబంధిత ఏఈ విభాగాల కింద క్షేత్ర స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. దీన్ని తప్పు పడుతూ యూనియన్ నాయకులు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాలను సస్పెండ్ చేసినట్లు యూనియన్ నాయకులు మురళీ, గణేష్‌లు తెలిపారు. ఈ ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ల నియామకాలలో లక్షల రూపాయల అవినీతి చోటు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఎస్పీడీసీఎల్ సీఎండీ, ఈఈ ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేయడంతో ఔట్‌సోర్సింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవద్దని సంబంధిత ఏఈలకు ఆదేశాలు జారీ చేశామని ఈఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

రాజంపేట ఎంపీ బరిలో కిరణ్‌కుమార్‌రెడ్డి

- ఊహాగానాలకు తెర
- ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం
- రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా డాక్టర్ భాస్కర్‌రావు

రాయచోటి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి తరపున రాజంపేట పార్లమెంటు సీటును భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఆ పార్టీ తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి బరిలోకి దిగుతున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం రాష్ట్రంలో తమ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో గత కొన్ని రోజులుగా రాజంపేట పార్లమెంటు స్థానం విషయమై ప్రచారంలో ఉన్న ఊహాగానాలకు తెరపడింది. తొలుత రాజంపేట పార్లమెంటు స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను తెలుగుదేశం పార్టీ తెరపైకి తెచ్చింది. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆయన నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేశారు. అయితే టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ కూడా చేరడంతో ఒకసారిగా పరిస్థితి మారిపోయింది. ఈ స్థానాన్ని బీజేపీ కూడా ఆశించింది. దీంతో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే తెలుగుదేశం పార్టీ తొలుత బీజేపీకి ప్రకటించిన ఆరు పార్లమెంటు స్థానాలలో రాజంపేట పేరు లేదు. అరకు, రాజమండ్రి, అనకాపల్లె, తిరుపతి, విజయనగరం, నరసాపురం పేర్లు వినిపించాయి. తర్వాత ఏమైందో? ఏమో విజయనగరం బదులుగా రాజంపేట స్థానాన్నే బీజేపీ కోరుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రకటించిన టికెట్లలో రాజంపేటను మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి దక్కించుకున్నారు. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారంలో ఉన్న బాలసుబ్రమణ్యంకు పార్టీ ఏం అవకాశం కల్పిస్తుందో..? వేచి చూడాల్సిందే..



డాక్టర్ భాస్కర్‌రావు

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా డాక్టర్ భాస్కర్‌రావు


కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా రైల్వేకోడూరు స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఆదివారం రాత్రి జనసేన పార్టీ తమ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. యనమల భాస్కర్‌రావును అభ్యర్థిగా ప్రకటించింది. పెనగలూరు మండలం నరసింగరాజపురానికి చెందిన ఇతను టీసీఎస్ కంపెనీలో సీఈవోగా పనిచేస్తున్నారు.

కిరణ్‌కుమార్ రెడ్డి వివరాలు

నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి: తండ్రి నల్లారి అమరనాథ రెడ్డి (మాజీ మంత్రి)

పుట్టిన తేదీ	: 13.9.1960 (హైదరాబాదులో)
విద్య	: ప్రాథమిక, మాధ్యమిక విద్య హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ బీకాం డిగ్రీ నిజాం కాలేజీ, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ
కుటుంబం	: భార్య: రాధికారెడ్డి, కుమారుడు: నిఖిలేష్ రెడ్డి, కుమార్తె: నిహారిక రెడ్డి
సోదరులు	: నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, సంతోష్‌కుమార్ రెడ్డి, సోదరి: గాయత్రి

రాజకీయం: తండ్రి మరణానంతరం 1989లో వాయల్పాడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి విజయం, 1995లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి, 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై గెలుపు. 2004లో టీడీపీ అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్‌పై గెలుపు. వైఎస్ హయాంలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఐదేళ్లు పూర్తిగా పనిచేశారు. 2009లో పీఆర్‌పీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై గెలుపు (టీడీపీ అభ్యర్థి ఇంతియాజ్), వైఎస్ హయాంలో 2009 నుంచి స్పీకర్‌గా కొనసాగింపు, వైఎస్ మరణానంతరం ఉమ్మడి ఏపీ 16వ చివరి ముఖ్యమంత్రిగా 25.11.2010 ప్రమాణస్వీకారం. రాష్ట్ర విభజన చట్టం అమల్లోకి రాగా 19.2.2014 ముఖ్యమంత్రి పదవికి రాజీనామా. 1.3.2014 వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగింపు. 1.3.2014 రాష్ట్రపతి పాలన విధింపుతో సీఎం పదవి నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే 10.3.2014న జైసమైక్యాంధ్ర పార్టీ (జైఎస్‌పీ) స్థాపన. తాను పోటీ చేయకున్నా ఏపీ రాష్ట్రంలో జేఎస్‌పీ పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో పోటీ చేయించారు. ఒక్క చోట కూడా గెలవకపోవడంతో రాజకీయంగా తాత్కాలిక నిష్క్రమణ. 13.7.2018లో జేఎస్పీని రద్దు చేసి తిరిగి కాంగ్రెస్‌లో చేరిక. కాంగ్రెస్‌కు తిరిగి రాజీనామా చేసి 7.4.2023న బీజేపీలో చేరిక.



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

చంద్రబాబు సీఎం కావడం అవసరం

- ఎమ్మెల్సీ రామచంద్రయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి, రామచంద్రయ్య, మాధవీరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), మార్చి 24: చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఆంధ్ర రాష్ట్రానికి అవసరమని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిలు తెలిపారు. లేకుంటే రాష్ట్రం అంధకారం అవుతుందని స్పష్టం చేశారు. ఆదివారం కడప నగరం ఐఎంఏ హాలులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యద ర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటరు బండి బాబు, సత్య, చలపతి, మరికొందరు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సి.రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. లేదంటే రాష్ట్రం అప్పుల ఊబిలో మునుగుతుందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటవుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. జగన్ వల్ల రాష్ట్రం అప్పుల్లో మునిగిందన్నారు. హరిప్రసాద్ మాట్లాడుతూ బలిజలకు తగిన ప్రాముఖ్యత నివ్వాలని కోరారు. కడపలో ఒక్క కార్పోరేటరు సీటు కూడా వైసీపీ ప్రభుత్వం బలిజలకు ఇవ్వలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కష్టపడ్డ వారికి ప్రాముఖ్యతనివ్వాలని కోరారు. టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంజద్‌బాషా అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఆరోపించారు. జనసేన వచ్చాక టీడీపీలో బలిజలకు ప్రాధాన్యత తగ్గిందన్న భావన పోవాలని.. చంద్రబాబు సీఎం కావాలని కోరారు. రాక్షస పాలనను రాష్ట్రం నుంచి అంతమొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేత చలపతి, జనసేన నాయకులు తుంగా రమణయ్య, మాలే శివ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి.. ఆర్టీసీ బస్సు ఢీకొని..

ఒకరు మృతి... మరొకరికి తీవ్ర గాయాలు




మృతి చెందిన యువకుడు అభిరామ్, ప్రమాదంలో గాయపడిన వెంకటేష్

రైల్వేకోడూరు, మార్చి 24: ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి, నెల్లూరు జిల్లా రాపూరు మండలం మల్లగుంటకు చెందిన అభిరాం (23) కొన్నేళ్లుగా స్థానిక తోట కన్‌సెషన్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం బైక్‌లో తిరుపతికి బయలుదేరాడు. లక్ష్మీ ప్యారడైజ్ సమీపంలో వెంకటేష్ అనే యువకుడు లిఫ్ట్ అడగడంతో అతనిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. సిద్దేశ్వర సినిమా థియేటర్ సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. దీంతో అభిరాం అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.. సమాచారం అందుకున్న సీఐ టి. బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంకటేష్‌ను రైల్వే కోడూరు ఆస్పత్రికి, మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు, మార్చి 24: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రేణిగుంట రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ కథనం మేరకు... రైల్వేకోడూరు రైల్వేస్టేషన్ పాత గేటు వద్ద ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు ధరించిన జీన్స్ ప్యాంటు, తెల్ల షర్టు ఊడిపోవడంతో నగ్నంగా ఉన్న మృతదేహం లభ్యమైందన్నారు. అతడు ప్రమాదవశాత్తూ రైలులోంచి జారిపడ్డాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్న వివరాలతో పాటు, అతని వ్యక్తిగత వివరాలేవీ లభ్యం కాలేదని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కువైత్‌లో గుండాపురం గ్రామవాసి మృతి



రామచంద్రారెడ్డి (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 : బ్రహ్మంగారిమఠం మండలంలోని చౌదరివారిపల్లె పంచాయతీ గుండాపురం గ్రామానికి చెందిన బిజివేముల రామసుబ్బారెడ్డి (47) అనే వ్యక్తి కువైత్‌కు వెళ్లాడు. గత నెల 16న పనిచేస్తూ భవనంపై నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని బంధువులు తెలిపారు. అప్పటి నుంచి కువైత్‌లోనే చికిత్స పొందుతూ మార్చి 21న మరణించాడు. మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామమైన గుండాపురం గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చెన్నూరు, మార్చి 24 : మండల కేంద్రమైన చెన్నూరు సమీపంలోని బుడ్డాయపల్లె వద్ద హైవే రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖాజీపేట మండలం దుంపలగట్టుకు చెందిన నలుగురు గాయపడ్డారు. దుంపలగట్టుకు చెందిన చాట్ల సుబ్బరాయుడు తన ఆటోలో పూలను వేసుకుని కడప నగరంలో విక్రయించుకునేందుకు బయల్దేరారు. ఆ ఆటోలో పూలు కోసిన మహిళలు ప్రమీల, వెంకటలక్షుమ్మ, నాగార్జున ఉన్నారు. చెన్నూరు బుడ్డాయపల్లె వద్ద ఓ ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొనడంతో అందులో ఉన్న నలుగురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల బాగోతం బయటపెట్టాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 24 : ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కడప జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇంతకాలం ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం ఎందుకు దాచి పెట్టారన్నది ఇప్పుడు అర్థమవుతోందన్నారు. తక్షణమే బాండ్ల బాగోతంపై దేశ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫండ్ పేరుతో సాగించిన మనీలాండరింగ్ సహా సకల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని ఆయన అన్నారు. ఆధారాలతో పక్కాగా బయటపడిన అతి పెద్ద కుంభకోణం ఇదని, బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీలే కాదు వైసీపీ, టీడీపీ, జనసేన కూడా ఈ బాండ్ల ద్వారా లబ్ధి పొందాయని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మనోహర్, రామ్మోహన్, శివకుమార్, ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అన్వేష్, సత్యనారాయణరెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నాయకులు శివకుమార్, సునీల్, రాజేంద్రతో పాటు వివిధ మండలాల పార్టీ శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డ్వామాలో.. డ్రామా

- ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా బదిలీలు
- పాత తేదీతో ఆర్డర్లు
- ఎదురు తిరిగిన సిబ్బంది
- సూసైడ్ చేసుకుంటా అనడంతో కలకలం

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ఈ నెల 16న వెలువడింది. ఆ రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ ఉన్నప్పుడు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే బదిలీలు చేపట్టాల్సి ఉంది. అయితే జగన్ పాలనలో అంతా రివర్స్. ఎన్నికల కోడ్ ఉన్నా డోంట్ కేర్. నాయకులనుకుంటే ఏమో అనుకోవచ్చు.. అధికారులు కూడా జగన్ పాలనకు బాగా కనెక్ట్ అయినట్లున్నారు. అందుకేనేమో ఎన్నికల కోడ్ ఉన్నా సరే.. కోడ్‌కే మస్కా వేసి పాత తేదీతో కావాల్సిన వారికి బదిలీలు చేసుకుని డ్రామా ఆడినట్లు చెబుతారు. ఉన్నపళంగా.. మ్యూచువల్ పేరుతో ఓ డీఏను బదిలీ చేశారు. అతను అడ్డం తిరగడంతో డ్వామాలో డ్రామా వ్యవహారం ఇప్పుడు బయటికి వచ్చింది. ఇప్పుడీ వ్యవహారం డ్వామాలో హాట్‌టాపిక్‌గా మారింది. డ్వామాలో ఇటీవలే బదిలీలు జరిగాయి. లాంగ్‌స్టాండ్‌లో ఉన్న వారందరినీ వేర్వేరు ప్రాంతాలకు బదిలీలు చేశారు.

పులివెందుల నేత సిఫారసుతో

నాలుగు నెలల క్రితం డ్వామాలో సాధారణ బదిలీలు జరిగాయి. ఒకేచోట దీర్ఘకాలికంగా పనిచేసిన వారిని ట్రాన్స్‌ఫర్ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర సిబ్బంది బదిలీలు సాగాయి. అయితే పులివెందులకు చెందిన ఒక ముఖ్య నేత సిఫారసుతో ఇప్పుడు సుమారు 20 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటరు ఆపరేటర్లు ఇతర వారిని బదిలీ చేయడం చర్చనీయంశంగా మారింది. ఈ నెల 16న ఎన్నికల కోడ్ వచ్చింది. అదే రోజు సాయంత్రం పులివెందుల నేత సిఫారసు మేరకు కమలాపురం, జమ్మలమడుగు, ఇతర ప్రాంతాల్లో 20 మందిని పిలిపించుకుని... 14వతేదీతో ఆర్డరు వేసి సంతకం చేసి ఆర్డరు కాపీలు ఇచ్చినట్లు చెబుతున్నారు. సాధారణంగా బదిలీల్లో మెయిలు, వాట్సప్ ద్వారా సమాచారం ఇస్తారు. కోడ్ వచ్చిన సాయంత్రం పూటే రిలీవ్ అయి జాయిన్ కావాలని చెప్పడం చర్చనీయాంశమైంది.



ఈ నెల 20వ తేదీన చింతకొమ్మ దిన్నెల్లో విధుల్లో ఉన్న వెంకటేశ్వర్లు

మ్యూచువల్ అట..

సీకేదిన్నెలో టెక్నికల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును మ్యూచువల్ పేరుతో కమలాపురానికి బదిలీ చేశారు. అతను మ్యూచువల్‌గా అప్లై చేసుకోనప్పటికీ మ్యూచువల్ పేరుతో బదిలీ చేశారు. కమలాపురం క్లస్టరు గ్రూపులో తనను అన్యాయంగా బదిలీ చేశారని ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత కూడా 14వ తేదీ వేసి, 16న ఫోను చేసి ఇచ్చారంటూ వాపోయారు. తాను 20వ తేదీ వరకు సీదిన్నెలోనే పనిచేస్తూ ఉన్నానని పేర్కొన్నారు. జరిగిన అన్యాయంపై కలెక్టరును కలిసి అనంతరం సూసైడ్ చేసుకుంటానంటూ ఆ గ్రూపులో పోస్టు చేశారు. ఈ వ్యవహారం సంచలనంగా మారింది. దీంతో వెంకటేశ్వర్లును ఖాజీపేటకు బదిలీ చేశారు. అయితే ఎన్నికల కోడ్ ఉండడంతో అక్కడున్న ఎంపీడీవో విధుల్లో చేర్చుకునేందుకు నిరాకరించారని అంటున్నారు.

అడ్డంగా దొరికేశారు

14వతేదీతో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు ఇచ్చారు. కొంత మంది రెగ్యులర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడానికి వెళ్లినప్పుడు గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ షేర్ చేస్తూ ఫొటోలు తీస్తారు. డేట్, టైమింగ్ అవన్నీ ఫీడ్ అయి ఉంటాయి. వీరంతా 16వ తేదీ వరకు ఆయా మండలాల్లో పనిచేశారు. అయితే 14వ తేదీనే రిలీవ్ అయినట్లు ఆర్డర్లు ఇవ్వడాన్ని చూసి ఇదేంది ఇంత నిర్లక్ష్యమా అనుకుంటూ సిబ్బందే ఆశ్చర్యపోతున్నారు.

పులివెందుల నుంచి పొలిటికల్‌గా ఫోను వస్తే చాలు.. ఇంత అడ్డగోలుగా వ్యవహరిస్తారా అంటూ విమర్శిస్తున్నారు. ఇక డ్వామాలో ఓ ఉద్యోగి విజయవాడలో జీతం తీసుకుంటూ ఇక్కడ పెత్తనం చెలాయించడాన్ని కొందరు సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. డ్వామాలో జరుగుతున్న ఈ డ్రామాలన్నింటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

కూర్చుంటే కుదరదు..జనాలను తోలాలి

ఎమ్మెల్యే సమక్షంలో సీఎం జగన్ బస్సు యాత్రపై నాయకుల మధ్య వాగ్వాదం ?

మైదుకూరు, మార్చి 24 : సీఎం జగన్ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తున్నాడులే అనుకుని ఈ ఎన్నికల్లో చేతులు ముడిచి కూర్చుంటే కుదరదు.. సీఎం జగన్ బస్సు యాత్రకు ఒక్కొక్క పంచాయతీ నుంచి కనీసం 300 మంది జనాల్ని తీసుకురావాలి.. ఆ బాధ్యత నాయకులతో పాటు గృహ సారథులదే అంటూ అధికార పార్టీ నేత హుకుం జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేము జనాల్ని తరలించాలంటే చాలాకష్టంతో కూడుకుంది. ఇప్పటి వరకు ఖర్చులు పెట్టుకుని ఈ ఎన్నికల సమయంలో కూడా మేమే ఖర్చు పెట్టుకోవాలంటే కుదరదంటూ నాయకుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... ఈనెల 27న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులో సిద్ధం బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఆ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రెండు రోజులుగా మైదుకూరులోని పార్టీ కార్యాలయంలో ఆయా మండలాలకు చెందిన నాయకులను పిలిపించి ఒక్కొక్క మండలం నుంచి కనీసం 5 వేల మందిని జన సమీకరణ చేపట్టాలని ఆయా మండలాల నాయకులకు హుకుం జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో బి.మఠం, మైదుకూరు మండలాలకు చెందిన నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో బి.మఠం నుంచి ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జడ్పీటీసీ రామగోవిందరెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. జనసమీకరణలో కనీసం ఒక్కొక్క పంచాయతీ నుంచి 300 మందిని తీసుకరావాలంటూ వీరనారాయణరెడ్డి పేర్కొనగా, దిరసవంచకు చెందిన వైసీపీ నేత మోహన్‌రెడ్డి ఇన్నాళ్లకు మేము గుర్తు కొచ్చామా.. అప్పుడంతా స్వయంగా లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టుకొని సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించుకున్నాం. ఈమధ్య కాలంలో నాకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇప్పుడు సిద్ధం సభకు జనాన్ని పిలుచుకువచ్చేందుకు మేము కనపడ్డామా.. ఆ ఖర్చు కూడా మేమే పెట్టుకోవాలా, అలా చేయలేం. ఎన్నికల సమయం ఇది. ఖర్చులు మీరే పెట్టుకోడంటూ పేర్కొనడంతో వీరనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యే ఇద్దరిని సముదాయించి, వాగ్వాదం సద్దుమణిగేలా చేశారు. కాగా మోహన్‌రెడ్డి కొంతకాలం నుంచి వీరనారాయణరెడ్డితో అసమ్మతిలో ఉన్నట్లు, టీడీపీలోకి వెళ్లే ఆలోచనలో ఉండటంతో జడ్పీటీసీ గోవిందరెడ్డి మోహన్‌రెడ్డిని సముదాయించి సమావేశానికి తీసుకువచ్చినట్లు తెలిసింది. అయితే అక్కడ మళ్లీ వీరానారాయణరెడ్డికి, మోహన్‌రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 శాఖల ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించిందని జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో విధుల్లో ఉంటూ పోలింగ్ రోజున ఓటు వేయలేని 33 శాఖల ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించిందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12 డీలను అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘం పేర్కొందని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వీరికే...

రైల్వే ప్రయాణికులు, సరుకు రవాణా సేవలు చేసే ఉద్యోగులు, మెట్రో, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్ని మాపక సేవలు, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్సు, షిప్పింగ్, ఫైర్ ఫోర్సు, జైళ్లు, ఎక్సైజ్, వాటర్‌శాఖలతో పాటు ట్రెజరీ, అటవీ, సమాచార, పోలీసు, హోంగార్డులు, ఆహార సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ(పవర్), ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా,ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మెటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ శాఖల ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై 193 ఫిర్యాదులు పరిష్కారం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద అందిన 194 ఫిర్యాదుల్లో 193 పరిష్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ప్రింట్ మీడియా ద్వారా 45 ఫిర్యాదులు, మానిటరింగ్ సీఈవో యాప్ ద్వారా 23, జిల్లా కాల్‌సెంటర్ నుంచి 3, ఎన్‌జీఎస్‌పీ ద్వారా 3, సిటిజన్ యాప్ ద్వారా 104 ఫిర్యాదులు అందాయన్నారు. సోషల్ మీడియా ద్వారా 7, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా 5, ఆన్‌లైన్ ద్వారా 4 ఫిర్యాధులు వచ్చినట్లు ఆప్రటకలో తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

ఓబులవారిపల్లె, మార్చి 24: గుర్తు తెలియని వాహనం ఢీకొని మంగంపేట దగ్గర ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాల మేరకు.. పోలూరు నాగేశ్వర్‌రెడ్డి(37) రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం గ్రామం నుంచి రాయచోటిలోని బంధువుల దినం కార్యక్రమానికి వెళ్లే క్రమంలో మంగంపేట పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రాన్ని మాఫీయాంధ్రప్రదేశ్‌గా మార్చారు

మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), మార్చి 24: రాష్ట్రంలో జగన్ మాఫియా పాలన సాగుతోందని, నమ్మి ఓట్లు వేసినందుకు గంజాయి, డ్రగ్స్ మత్తు మందులతో యువత జీవితాలను నాశనం చేసే కుట్ర జరుగుతోందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి జగన్ సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో తులసి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములతో కలసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌పాలనలో లాండ్ మాఫీయా, శాండ్ మాఫియా, మద్యం మాఫియా, మైనింగ్ మాఫీయా, ఎర్రచందనం మాఫీయా, ఎర్రమట్టి మాఫియా, సబ్సిడీ బియ్యం మాఫీయాతో పాటు యువత జీవితాలను బుగ్గిపాలు చేసే డ్రగ్స్ గంజాయి మాఫీయాలతో రాష్ట్రం మాఫీయాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. విశాఖ, అరకు ప్రాంతాల్లో టీ ఆకు పంటలకు ఫేమస్ అన్నారు. అక్కడ కూడా గంజాయి సాగు జరుగుతుండంతో దేశంలో అనేక రాష్ట్రాలకు తరలి పోతుందన్నారు. పూర్వం కొందరు పెద్దలు మాత్రమే గంజాయి మత్తుకు బానిసలయ్యారు... నేడు జగన్ పాలనలో స్కూలు విద్యార్థులు కూడా గంజాయి మత్తుకు బానిసలుగా మారుతుండటం బాధాకరమన్నారు. జిల్లాలో వైసీపీ నేతల భూదాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. కొత్త మాధవరంలో చేనేత కార్మికుడు సుబ్బారావుతో పాటు భార్య, కుమార్తెల ఆత్మహత్యలకు పాల్పడటానికి వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులే కారణం అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 28వ తేదీ కడపలో పెద్ద దర్గా వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్, వెంకటరమణారెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, మహ్మద్ అలీఖాన్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు మృతి

ఓబులవారిపల్లె, మార్చి 24: మండలంలోని గాదెల గ్రామానికి చెందిన వంగినేని ఆంజనేయులు కుమారుడు వంగినేని శివశంకర్ (26) అప్పుల బాధ తాళలేక మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. పంటలు సాగు చేయడం వల్ల అప్పులు కావడంతో గడ్డి మందు ద్రావణం సేవించడంతో గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కొరకు తిరుపతి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల ఆలోచనాధోరణి మార్చడానికే 'విపశ్యన'

స్వర్గీయ వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత

పులివెందుల, మార్చి 24: ప్రజల ఆలోచన ధోరణి మార్చడానికి తన వంతుగా ఏదైనా చేయాలనే ఆలోచనతో విపశ్యన ధ్యాన శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత అన్నారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని విపశ్యన ధ్యాన శిక్షణ కేంద్రంలో భర్త రాజశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాన్న చనిపోయిన తర్వాత అనుకోని పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. ఏం చేయాలి అని ఆలోచిస్తున్న సమయంలో కొంతమందితో మాట్లాడడం, ప్రజల ఆలోచన ధోరణి ఎలా మార్చాలి, మార్చడం కుదురుతుందా అని ఆలోచించేవారమన్నారు. కొందరు పోలీసు అధికారులను కలిసి మాట్లాడడం జరిగిందన్నారు. వీళ్లని మార్చలేమనే అభిప్రాయాలు వారు వ్యక్తం చేసినపుడు, నేను సంఘర్షణ పడుతున్న సమయంలో విపశ్యన ధ్యాన కేంద్రం గుర్తుకు వచ్చిందన్నారు. విపశ్యన ద్వారా ఇంప్రూవ్ అయిన తీహార్ జైలు గురించి తెలుసుకున్నానన్నారు. దీంతో మన ఊరిలో ప్రజలు ఆలోచనాపరంగా కొంత ఇంప్రూవ్ అయితే బాగుంటుంది కదా అని ఆలోచించామన్నారు.

తప్పు తెలుసుకోవాలన్నదే నా కోరిక

ఏదైనా తప్పు చేసిన వాళ్లు, జైలుకెళ్లిన వాళ్లు ఆ తప్పును తెలుసుకోవాలన్నారు. జైలు అంటే చేసిన తప్పు తెలుసుకొని మార్పు చెందే ఒక రీహాబిలిటేషన్ కేంద్రం లాంటిదన్నారు. కానీ చాలామంది తప్పు తెలుసుకోకుండా అంతకుమించిన క్రిమినల్ మైండ్‌తో వస్తుంటారన్నారు. తీహార్ జైల్లో జైలుకు వచ్చిన వారి కోసం కిరణ్‌బేడి విపశ్యన శిక్షణను పరిచయం చేశారన్నారు. అక్కడ వారికి రీహాబిలిటేషన్ కేంద్రంగా ఉండేదన్నారు. అలాగే కడపలో కూడా ఒకటి రెండుసార్లు నడిచిందన్నారు. అలా కంటిన్యూ చేయాలన్నది నా కోరిక అన్నారు.

20 ఎకరాల్లో ఏర్పాటు

పులివెందులలో 20 ఎకరాలలో ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ధ్యాన శిక్షణ పొందే వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కేంద్రం గురించి ఆమె వివరిస్తూ ప్రస్తుత విద్యార్థి జీవితం చాలా స్ట్రెస్‌తో కూడుకున్నదన్నారు. ఆ స్ట్రెస్‌ని డీల్ చేయడం ఒక మేజర్ టెక్నిక్, సెల్ఫ్ అవేర్‌నెస్, సెల్ఫ్ రియలైజేషన్ అయ్యేందుకు విపశ్యన నేర్పుతుందన్నారు. ఇక్కడ నేర్పే పద్ధతులతో మన మైండ్, బాడీని కంట్రోల్ చేసుకునేందుకు హెల్ప్ అవుతుందన్నారు. పది రోజులు చేసి విడిచిపెట్టేది కాదన్నారు. ప్రతి సంవత్సరం చేయాలన్నారు. ఏం పని చేసినా ఇంకా బాగా చేయగలిగే స్థితికి తెస్తుందన్నారు. జీవితంలో మీరు ఏ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా విపశ్యన శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మాజీ రాష్ట్రపతులు ప్రతిభాపాటిల్, రామ్‌నాథ్‌కోవింద్, అరవింద్ కేజ్రీవాల్, రాహుల్‌గాంధీ, చంద్రబాబునాయుడు వీళ్లందరు కూడా విపశ్యన టెక్నిక్స్ తెలుసుకున్న వారే అన్నారు. విపశ్యన శిక్షణకు అటెండ్ కావడానికి మహారాష్ట్ర ప్రభుత్వం పదిరోజుల పాటు సమయం ఇస్తారన్నారు. ఇది ఏ ఒక్క మతానికి సంబంధించినది కాదన్నారు. ఇది మనల్ని మనం ఎలా ఇంప్రూవ్ చేసుకోవచ్చు అనే విషయాన్ని తెలుసుకునేందుకే విపశ్యన శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఇంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో కూడా విపశ్యన శిక్షణ ఇచ్చేవారన్నారు. ఆరోగ్యపరంగా చాలా మంది బయటపడ్డారన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సునీత

విపశ్యన కేంద్ర నిర్వాహకులు నందకిషోర్ మాట్లాడుతూ విపశ్యన అనేది ఒక ప్రాచీనమైనదన్నారు. రుగ్వేదంలో ప్రస్తావించిందన్నారు. 2500 సంవత్సరాల క్రితం గౌతమబుద్ధుడు దీనిని తిరిగి కనుగొని ప్రజలకు అందజేశారన్నారు. పశ్యన అంటే చూడడం విపశ్యన అంటే విశేషంగా చూడడం అన్నారు. ఉన్నది ఉన్నట్లుగా ఒక భావం తలెత్తగానే అది మన శరీరం మీద ఎలా ప్రభావం చూపుతుంది.. ప్రభావితమైన శరీరం తిరిగి మనసులో ఉన్న ఈ భావనను ఎలా తీవ్రం చేస్తుంది.. అలా మన మనసులో ఏర్పరచుకున్న భావాలన్నీ స్వభావంగా ఎలా మారుతాయి, వాటి నుంచి ఎలా బయటపడతారనేది ఈ ధ్యానంలో నేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ విపశ్యనలో పది రోజుల పాటు ఇక్కడే ఉంటూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 గంటలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదిరోజుల్లో అంచలంచెలుగా ఈ విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. ఇందులో మొదటి మూడు రోజులు ఆనాపానసాతి గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆనా అంటే లోనికి వచ్చే శ్వాస, అపాన అంటే బయటకు వెళ్లే శ్వాస, సాతి అంటే గమనించడం అన్నారు. శ్వాసను గమనించడం వల్ల మనసును తేలికగా ఉంచుకోవచ్చన్నారు. మిగిలిన ఏడు రోజుల్లో విపశ్యన టెక్నిక్స్ నేర్పించడం జరుగుతుందన్నారు. తద్వారా మనిషి తనను తాను మార్చుకొని అంచెలంచెలుగా ఎదిగేందుకు విపశ్యన టెక్నిక్స్ ఉపయోగపడుతాయన్నారు. 20ఏళ్లకు పైబడిన వాళ్లు ఎవరైనా చేరవచ్చు అన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తైన వారు మిగిలిన వారికి ఈ శిక్షణ దక్కాలనే ఉద్దేశంతో సహాయ సహకారాలు అందిస్తుంటారన్నారు. స్వచ్ఛందంగా దానం ఇస్తారన్నారు. అలా పాత సాధకులు ఇచ్చిన దానంతో తర్వాతి శిక్షణ మొదలవుతుందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ధమ్మ.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు అన్నారు. వచ్చే నెల నుంచి 15 నుంచి 19ఏళ్ల లోపు వారికి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. వీరికి ఏడురోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటటి ఒక విద్య చిన్నతనంలోనే అలవర్చుకుంటే సరైన జీవితం ఎలా జీవించాలో తెలుసుకోవచ్చు అన్నారు.

గుంటూరు నుంచి వచ్చి శిక్షణ పొందిన సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుతమున్న అన్ని సమస్యలకు విపశ్యన శిక్షణతో పరిష్కారం లభిస్తుందని నాకు అనుభవం ద్వారా తెలిసిందన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఉపయోగించుకొని జీవితాన్ని అద్భుతంగా మలచుకోవాలన్నారు. ఇపుడు ఎక్కువగా మానసిక వ్యాధులే అన్నారు. ఉరుకు పరుగుల జీవితంలో తీవ్ర ఒత్తిడికి లోనై ఆ ప్రభావాన్ని కుటుంబంపై చూపి ఎవరు కూడా మనశ్శాంతి లేకుండా జీవిస్తున్న పరిస్థితులను ఈరోజు సమాజంలో చూస్తున్నామన్నారు. విపశ్యన చేసిన వాళ్లు ఈ సమస్య తాత్కాలికమైనదే అనే భావనతో ఉంటారన్నారు. మానసిక వ్యాధిబారిన పడిన నా స్నేహితుడు సాధారణంగా తయారయ్యాడన్నారు. ప్రతి ఒక్కరు అనుభవం ద్వారా తెలుసుకోవాలన్నారు.

హైదరాబాద్ నుంచి వచ్చి శిక్షణ పొందిన రాజేశ్వరి మాట్లాడుతూ ఇక్కడ నేర్పిన టెక్నిక్స్ ద్వారా చాలా ప్రశాంతమైన జీవితం లభించిందన్నారు. అందుకే మళ్లీ మళ్లీ విపశ్యన శిక్షణ తీసుకుంటున్నా అన్నారు. ఎన్ని ఇంగ్లీష్ మందులు వాడినప్పటికి తాత్కాలికమే అన్నారు. మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నది విపశ్యన ద్వారా తెలియవచ్చిందన్నారు.

ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా?

● హైవే రహదారి అంధకారమయం ● రాత్రి 7 గంటలు దాటితే బిక్కుబిక్కు ● ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ● 14 నెలలైనా లైట్లకు మోక్షం కరువు



టోల్‌ప్లాజా తొలగించిన హైవే రహదారిపై లైట్లు లేని దృశ్యం

చెన్నూరు, మార్చి 24 :నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారి చీకటిపడితే భయాన్ని కలిగిస్తోంది. జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా తొలగించిన ప్రదేశంలో ఇప్పటి వరకు 7గంటలు దాటిందంటే ఎవరైనా బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిందే. ఆ దారిలో వెళుతురు ఉండదు. దీంతో వాహనదారులు ఏ ప్రమాదం ఏ వైపు నుంచి ముంచుకొస్తుందోననే భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు ఆ వైపుగా దృష్టి సారించకపోవడంతో వాహనచోదకులు జాతీయ రహదారిపై చీకటి పడ్డాక ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. ఇది ఎక్కడో కాదు.. చెన్నూరు మండలంలో రాచిన్నాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద హైవే రహదారిపై టోల్‌ప్లాజా తొలగించిన ప్రదేశమే వాహన చోదకుల్లో భయాన్ని నింపుతోంది. దీంతో 14 నెలలు గడిచినా లైట్లకు మోక్షం లేదా అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వివరాలిలా ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని చిన్నమాచుపల్లె సమీపంలో రాచిన్నాయపల్లె క్రాస్ రోడ్డు (లాకర్స్ వద్ద) హైవే రహదారిపై 14 నెలల క్రితం టోల్ ప్లాజా తొలగించారు. దాన్ని ఖాజీపేట మండల పరిధిలోకి మార్చారు. అప్పటి వరకు ఉన్న లైట్లను తీసివేసి కొత్తగా లైట్లను వేసిన పాపాన పోలేదు. సుమారు 500 మీటర్లు (అర్ధ కిలోమీటరు మేర) లైటింగు లేకపోవడంతో రాత్రి 7 గంటలు దాటిందంటే ఈ హైవే గాడాంధకారంగా ఉంటుంది. పెగా ఈ ప్రాంతం లో రహదారి వెడల్పు కూడా ఎక్కువగా ఉండటంతో వచ్చిపోయే వాహనాలు చీకటిపడ్డా వాటి వేగం తగ్గించకుండా వంద నుంచి 120 కి.మీతో దూసుకుపోతుంటాయి. దీంతో పెద్ద వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఇతర వాహనాల్లో వెళ్లే వారు భయంతో వణికిపోతుంటారు. ఈ అర్ధకిలోమీటరు దాటితే చాలురా బతుకుజీవుడా.. అంటూ భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. టోల్‌ప్లాజా తొలగించిన తరువాత కనీసం ఈ ప్రాంతంలో లైట్లు వేయాలన్న ఆలోచన కూడా అధికారులు చేయలేదు. అంతేకాక కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో ఆ శాఖ అధికారులు హైవే అధికారులకు తెలిపి లైట్లు వేసే ఆలోచన చేయనట్లుంది. రోడ్డు మీద ఏం జరిగితే మాకేం సంబంధం అన్న తీరుగా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరును దుయ్యబడుతున్నారు. ఇర్కాన్ సర్కిల్ నుంచి శేషయ్యగారిపల్లె వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనాలు కూడా అప్పుడప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాళ్లుచేతులు విరిగిన వారు వైద్యశాలలో చేరిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు, హైవే అధికారులు స్పందించి అర్ధకిలోమీటరు మేర లైట్లు వేసి ప్రమాదాల బారిన నుంచి వాహనదారులను కాపాడాలని కోరుతున్నారు. అలా కాకుండా మాకేం పట్టిందిలే అనుకుంటే ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఇర్కాన్ సర్కిల్ వద్ద పెద్ద లారీ దూసుకువచ్చి విధి నిర్వహణలో ఉన్న రవాణాశాఖ అధికారిని ఢీకొట్టి ఆయన మృతికి కారణం కావడంతో వెంటనే అధికారులు స్పందించి అక్కడ స్పీడ్ బ్రేకరు ఏర్పాటు చేశారు. అంత పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోతేగాని పట్టిం చుకోరా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరగకముందే లైట్లు ఏర్పాటు చేయాలి



టోల్‌ప్లాజా తొలగించిన ప్రాంతం చాలా వెడల్పుగా ఉంది. దాదాపు అటు రాను ఇటు పోను పది వాహనాల వరకు రాకపోకలకు వీలుగా ఉంటుంది. అలాంటి చోట రాత్రివేళ లైట్ల ఏర్పాటు లేకపోతే పెద్దప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరు? ప్రమాదాల పాలైన వారు కుటుంబ యజమానులను కోల్పోతే దిక్కు ఎవరు? అధికారులు ఈ విషయంలో స్పందించాలి. ముందే స్పందిస్తే ప్రమాదాన్ని అరికట్టవచ్చు.

- ఆకుల ప్రసాద్‌బాబు, చెన్నూరు

గతంలో ప్రమాదాలు జరిగాయి... అయినా పట్టించుకోలేదు



టోల్‌ప్లాజా తొలగించిన చోట గతంలో ప్రమాదాలు జరిగాయి. పైగా ఈ రహదారికి ఇరువైపులా వ్యవసాయ పొలాలు, కేసీ కెనాల్ ప్రధాన కాల్వ ఉంది. రోడ్డు దాటుతూ రాత్రివేళవాహనాల లైట్లు వెలుతురులో విష సర్పాలు కనిపిస్తున్నాయి. ప్రజలు భయపడుతున్నారు. పది, 12 లైట్లు వేసేందుకు లక్షలు ఖర్చు అవుతాయా, ప్రజల ప్రాణాల కన్నా లైట్లు ముఖ్యమా. ఇప్పటికైనా స్పందించకుంటే భవిష్యత్తు ఏమైనా ప్రమాదాలు జరిగితే అధికారులు బాధ్యత వహించాలి.

- మల్లిఖార్జున రెడ్డి, చెన్నూరు

కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలి

● బీటెక్ రవికి ఘనస్వాగతం



సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

చక్రాయపేట, మార్చి 24: తెలుగుదేశం కార్యకర్తలు మనో ధైర్యంతో మెలగాలని వైసీపీ నాయకులు చేసే అరాచకాలకు బెదరద్దని కార్యకర్తలకు పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. ఆయన ఆదివారం సురభి గ్రామం నాగులగుట్టపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చక్రాయపేట మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, సురభి ఉపసర్పంచు దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు గావించారు. అనంతరం బీటెక్ రవి కార్యకర్తలతో మాట్లాడుతూ స్వయానా ముఖ్యమంత్రి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని నివారించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఒక ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని చక్రాయపేటలో మహిళలు లబోదిబోమంటున్న పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. దాసరి ఆంజనేయులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌పై అధికారులచే తనిఖీలు చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. వచ్చేది తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. కార్యకర్తలు మరనోధైర్యంగా ఉండాలన్నారు. చక్రాయపేట మండలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తోలామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం నీటిని అందించలేదన్నారు. మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, బీసీ సంఘ నాయకుడు నాగేంద్రయాదవ్, మండల ఉపాధ్యక్షుడు చంద్ర, రామాంజనేయరెడ్డి, మాజీ ఉపమండలాధ్యక్షుడు నరసింహులు, యోగీశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రమేష్, పరమేశ్వర్, అమర్, మాజీ ఎంపీటీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు



బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన రవీంద్రనగర్ ప్రజలు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 24 :కడప నగరం రవీంద్రనగర్‌లో బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీ రెడ్డి వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గోవర్ధనరెడ్డి, జిలానీబాషా, బుజ్జిరెడ్డి, ఎండీహెచ్‌బాషా, అప్సర్‌ఖాన్, చెన్నంశెట్టి మురళి, ఫజల్, యూసఫ్, జియావుద్దీన్, జిలాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడకుంటే మానవాళి మనుగడకు ముప్పే



హెరిటేజ్‌వాక్‌లో పాల్గొన్న ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 24:ప్రకృతిని కాపాడుకోకుంటే మానవాళి మనుగడకు ముప్పేనని ఇం టాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఆదివారం కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు ఇంటాక్ ఆధ్వర్యంలో పాలకొండలు సమీపంలో గల నగరవనంలో హెరిటేజ్‌వాక్ నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ మనిషి ప్రకృతి వర ప్రసాదమని, ప్రాణంతో పాటు దాన్ని కాపాడుకుంటేనే పంచభూతాల రూపంలో మానవుడికి ఎంతో ఇస్తున్న ప్రకృతిని కాపాడుకునేందుకు తప్పక చర్యలు చేపట్టాలన్నారు. కరువులు నీటి ఎద్దడి ప్రకృతిని నిర్లక్ష్యం చేసినందుకు ఫలితమన్నారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని నేటి తరానికి పరిచయం చేసేందుకు దాని ప్రస్తుత స్థితిగతులు తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిచడం ఎంతో అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు డాక్టర్ రంగనాథరెడ్డి, కోడూరు జనార్ధన్‌రాజు, భారవి, సీవీసుబ్బారెడ్డి , కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ, రఘునాథరెడ్డి, మల్లేశ్వరరావు, నాగవేణి, అరుణ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్షపాతం లేకుండా అమలు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 24 : ఎన్నికల నిబంధనలు పక్షపాతం లేకుండా అమలు చేయాలని అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకుడు సురేష్‌బాబు అన్నారు. ఆదివారం అభ్యుదయ వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో ఎన్నికల కోడ్ మేరకు అధికారులు ఎన్నికలనిబంధనలను ఎటువంటి వత్తిడులుకు తలొగ్గకుండా పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ఎన్నికల కమిషన్లు తరతమ బేధాలు లేకుండా ఎన్నికల కోడ్ అతిక్రిమించిన వారిపై చర్యలు చేపట్టాలని గతంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించిన టీఎన్‌సెషన్‌ను ఈ విషయంలో ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కులమతాలకు అతీతంగా కలిసిమెలసి జీవించాలి

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి



విప్తార్ విందులో భోజనాలను వడ్డిస్తున్న జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) మార్చి 24 : న్యాయ శాఖ ఉద్యోగస్తులందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా ప్రధాన జడ్జి తన బంగ్లాలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు, ఇతర ఉద్యోగులకు విప్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి శ్రీదేవి న్యాయ శాఖ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగస్తులు న్యాయశాఖలో ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు జరగలేదని ఇదే మొదటిసారని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ సెక్రటరీ బాబా పక్రుద్దీన్, పలువురు జడ్జిలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టివిఎం కృష్ణారావు, న్యాయశాఖ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో సాంకేతిక విద్యకు పాతర'

కడప (మారుతీనగర్), మార్చి 24: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే సాంకేతిక విద్యకు వైసీపీ ప్రభుత్వం పాతరేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ షార్ట్‌హ్యాండ్ ఇన్స్టిట్యూట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా టైప్‌రైటింగ్ షార్ట్ హ్యాండ్ ఇన్స్టిట్యూట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హరితహోటల్ సమావేశ మందిరంలో అసోసియేషన్ తాలూకు రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం ఏపీటీఎస్ఐ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీరాములు, గౌరవాధ్యక్షుడిగా మోహన్‌రావు, జనరల్ సెక్రటరీగా సుభాని, కోశాధికారిగా నరసింహులు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకృష్ణ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ కోసం ఐక్యంగా సాగుదాం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 24 : సామాజిక సేవల కోసం ఐక్యంగా సాగుదాం అని లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నరు కెచిన్నపరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యులంతా ఐక్యంగా ఒకే తాటిపై నిలిచి ప్రజలకు సేవలందించడంలో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజులు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ హరినాథరెడ్డి, సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'పదోతరగతి స్పాట్ నుంచి మినహాయింపునివ్వండి'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 24 : ప్రత్యేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు పదోతరగతి మూల్యాంకన విధుల నుంచి మినహాయింపునివ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆరనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆలీఖాన్,ఈశ్వర్‌చంద్ర ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. చిన్నపిల్లల సంరక్షణలో ఉన్న పిల్లల ఆరోగ్య బాధ్యతలకు పాటుపడుతున్న వారికి, గర్భవతులకు, వ్యాధిగ్రస్తులకు 55 ఏళ్ల వయసు దాటిన వారికి మినహాయింపునివ్వాలన్నారు.

'పరాకాష్టకు చేరిన భూ ఆక్రమాలు'

కడప (నాగరాజుపేట), మార్చి 24 : భూ ఆక్రమణలు పరాకాష్టకు చేరాయని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల ఓబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మగ్గం ద్వారా జీవనం సాగిస్తున్న సుబ్బారావు కుటుంబం భూ అక్రమార్కుల చేతిలో ఆత్మహత్యలు చేసుకోవడం ప్రజలను విస్మయానికి గురి చేసిందన్నారు.

సర్వమంగళ ప్రదాయణి.. మహాలక్ష్మి నమోస్తుతే



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

వల్లూరు, మార్చి 24 :మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లె నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి నారసింహస్వామి 28వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ప్రభాతపూజతో పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు మూలమంత్ర జపంతో పాటు మూలవిరాట్ లక్ష్మినరసింహుడుకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం నవగ్రహ హోమం, శ్రీసూక్త, నారయణహోమం నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మి నృసింహ మంత్ర సంపుటిత సుదర్శన హోమం ఉదయాన్నే నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి మంగళహారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం వేళ చితుష్టనాస్తపారాయణం నిర్వహించిన అనంతరం నృసింహ పారాయణం చేసి లఘు పూర్ణాహుతి చేశారు. అనంతరం సుహాసినీలతో లక్ష్మీపూజ వైభవంగా నిర్వహించి కుంకుమార్చన చేశారు. అనంతరం సామూహిక లక్ష్మీపూజలో పాల్గొని ఆమహాలక్ష్మికి కుంకుమార్చన చేశారు. ఈసందర్భంగా మహాలక్ష్మి పూజను వివిధ రకాల పూలతో అర్చనచేసిన అనంతరం సామూహికంగా కుంకుమార్చన చేశారు. ఈ కుంకుమార్చనలో నరసింహారెడ్డి ధర్మపత్నితో పాటు కుమారుడు చైతన్యరెడ్డి, భార్య చైతన్యతో పాటు పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి, భార్య వెంకటసుబ్బమ్మలు ఈ పూజల్లో పాల్గొన్నారు. వీరే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం జరిగిన ట్రాక్టరు ట్రాలీ లివర్స్ పోటీల్లో యువకులు పాల్గొన్నారు. అలాగే రాత్రి తాళం భజనపోటీలు జరిగాయి. అలాగే నేడు ఉదయం నుంచి ప్రత్యేక హో మాలు నిర్వహించిన అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారని మధ్యాహ్నం 11కు లక్ష్మినరసింహస్వామి కళ్యాణం మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు పుత్తా తెలిపారు. అలాగే ఉదయం 9గంటలకు చెక్కభజన పోటీలు, 10గంటలకు అల్లెంగుండు పోటలు నిర్వహిస్తామని, దీంతో పాటు నేడు ఉదయం 8గంలటలకు పాలపల్లుఎద్దులకు రాతిదూలం పోటీలు, మధ్యాహ్నం సేద్యపు ఎద్దుల విభాగం పోటీలు ఉంటాయన్నారు. అలాగే రాత్రి హైదరాబాదు వారిచే పాటకచ్చేరి ఉంటుందని అన్నారు.

28 నుంచి ఉచిత శిక్షణ

పులివెందుల రూరల్, మార్చి 24: పాలిసెట్, ఏపీఆర్జేసీ ప్రవేశాలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. రాజు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 10వ తరగతి పరీక్షలు రాసి పాలిసెట్, ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.



గాజుల అలంకరణలో గంగమ్మ తల్లి



గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి

సీకేదిన్నె, మార్చి 24: గంగమ్మతల్లి రెండవ ఆదివారం సందర్భంగా భక్తులకు గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు తరలించారు. గంగమ్మ తిరుణాళ్ల అనంతరం జరిగే నాలుగు వారాల్లో రెండవ వారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారికి బోనాలు తీసుకొచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించుకుని వారి మొక్కులు తీర్చుకున్నారు. చల్లగా చూడాలని పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఆధ్యాత్మిక జీవనం... ఆనందకరం

క డప (కల్చరల్), మార్చి 24: ఆధ్యాత్మిక జీవనం ఎంతో ఆనందకరంగా ఉంటుందని పాస్టర్ పి. మహేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బిల్లప్ సర్కిల్ సమీప కృపా కాలనీలో గల న్యూ నేటివ్ కృపా ప్రార్ధనా మందిరంలో ప్రజల క్షేమార్ధం ప్రత్యేకంగా మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక రక్షకుడైన యేసు క్రీస్తు మరణానికి ముందు ఓలీవ కొండ దగ్గర నున్న బేతనియ అనే గ్రామంలోకి ప్రవేశిస్తున్న సమయంలో అక్కడి ప్రజలు దారి పొడవునా బట్టలను పరస్తూ కర్జూర మట్టలతో జయము..జయము అంటూ స్వాగతం పలికారన్నారు. ప్రభువు దైవ మానవుడిగా ఈ లోకంలో జన్మించి దినత్వాన్ని కనబరచారన్నారు. కావున ప్రజలంతా సంతోషం, సమాధానాలతో జీవ వాక్యాన్ని భక్తితో చేబూని ఆధ్యాత్మికజీవితం అవలంభించాలని కోరారు. ఆ మేరకు విశ్వాసులు పెద్దఎత్తున పాల్గొని యేసుప్రభువు చల్లని దీవెనలు పొందాలని ఆకాంక్షిస్తూ విజయానికి నిదర్శనంగా కర్జూరపు మట్టలు చేబూని ప్రభువుకి మహిమ కలుగును గాక అని కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో విశ్వాసులు సిస్టర్ శాంతమ్మ, పి. రవితేజ, అగస్టిన్, ఎ. రవి, సుధాకర్, శాంతిరాజు, నరసయ్య, రోజా, లీలావతి, సుగుణమ్మ, పార్వతమ్మతో పాటుగా పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.



కుటుంబ ఆత్మహత్యకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 24 : ఒంటిమిట్టమండలం కొత్తమాధవరం గ్రామంలో ఒక కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ఆ ఆత్మహత్యకు ప్రభుత్వమే సమాధానం చెప్పాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మాచిరెడ్డిపల్లెలోని ఆయన స్వగృహంలో విలేకరులస మావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ మృతికి రెవెన్యూ అధికారులే కారణమని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. జగన్‌రెడ్డి బీసీలు బడుగుబలహీన వర్గాలు నా వైపే అని అంటున్నారు, బడుగు బలహీన వర్గాలు ఆత్మహత్య చేసుకుంటే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. కొత్త మాధవరంలో సుబ్బారావు ఆయన భార్య, కూతురు ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఒంటిమిట్ట పొలంలో మూడు ఎకరాలు 10 సెంట్లు భూమి ఉంది. ఆ భూమి వేరే వాళ్లు స్వాధీనం చేసుకుని తహసీల్దరు కార్యాలయంలో వేరే పేరుతో మార్చుకున్నారన్నారు. తమ పేరు మీద ఉన్న భూమి వేరే వారి పేరుపై ఎలా మార్చారని తహసీల్దారును అడిగినా సరైన సమాధానం చెప్పలేదన్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక, ఉన్న భూమి ఎవరి పేరునో ఉండడంతో ఎదిరించలేక ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. ఆత్మహత్య సంఘటనపై కలెక్టరు, రెవెన్యూ అధికారులదృష్టికి కూడా వచ్చి ఉంటుందని, మరి తహసీల్దారు మీద ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తప్పక టీడీపీ ప్రభుత్వం వస్తుందని ఎన్‌డీఏ కూటమికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అవుతారని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు గంగిరెడ్డి, ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డి, దాదిరామయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రెచ్చిపోతున్న భూ మాఫియా

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 24 : కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన పాలసుబ్బారావు, భార్య పద్మావతి, కూతురు వినయ ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, పెద్దకూతురు లక్ష్మికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మాధవరంలో మృతులకు నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ కుటుంబానికి కోటి రూపాయలు పరిహారంతో పాటు, పెద్దకూతురు లక్ష్మికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్పీ షరీఫ్‌ను కలిశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకటశివ, మండల కార్యదర్శి యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అమరేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొండాపురం, మార్చి 24: మండలకేంద్రమైన కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శని, ఆదివారాలలో హోమాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు.చివరి రోజైన సోమవారం ఉదయం 5-15 నుంచి అమరేశ్వర స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నారు.అమరేశ్వర స్వామితో పాటు,భవాని,గణపతి,నందీశ్వర,ధ్వజస్తంభం,శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా ఉదయం 10 గంటల నుంచి కొర్రపాడు ప్రసాద్ బృందంచే చెక్కభజన ఉంటుందన్నారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి తెలుగు పండిట్ గోర్ల బాల ఓబులేసు ఆధ్వర్యంలో అన్నదానం,రాత్రికి భజన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 24: ఓటు విలువైందని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యంతో భగత్‌సింగ్ కాలనీలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బద్వేలు, మార్చి24: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం బద్వేలు టీబీ యూనిట్ ఎంటీసీ డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యం లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటవీధి యూపీహెచ్‌సీ డాక్టర్ సౌమ్య,శ్రీనివాసులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, ఏఎన్ఎం, ఆశ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ముద్దనూరు మార్చి24: మండలంలోని వివిధ ప్రదేశాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ముద్దనూరులోని చెరువు సమీపంలోని కంపచెట్లలో ఐదుగురు పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని వారి వద్ద నున్న రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదే విధంగా యామవరం శివాలయం సమీపంలోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వికలాంగులకు అన్యాయం జరిగితే ఉద్యమ బాట

బద్వేలు, మార్చి 24: బద్వేలు పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలంలో ఇల్లులేని వికలాంగులు గుడిసెలు ఏర్పాటు చేసుకుంటే పోలీసులు వారి గుడిసెలు కూల్చివేయడం దారుణమని వికలాంగులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటామని పలువురు పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌస్‌పీర్, ఏపీ దళిత చైతన్య ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య, అంబేడ్కర్ భవనం అధ్యక్షుడు బండి జకరయ్య మాట్లాడుతూ వికలాంగులు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే వారిపై దాడిచేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కేశవ, శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, మహిళా సంఘం నాయకులు బాలామ్మ, వికలాంగుల సంఘం నాయకులు మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌కు కార్యదర్శులు సహకరించాలి

గోపవరం, మార్చి 24 : ఎన్నికల నిబంధనల నిర్వహణలో వచ్చే ఫ్లయింగ్ స్క్వాడ్‌కు ఆయా గ్రామ కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీవో రాధాక్రిష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎన్నికల నిబంధనలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఈవోపీఆర్డీ షేక్ హసీనా ఎన్నికల నిబంధనల విషయంపై పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

బరితెగించి ఇసుక అక్రమ రవాణా

● వైసీపీ నేత పి.సుగుమంచిపల్లెలో పెన్నానదిలోకి వేసిన దారి





పి.సుగుమంచిపల్లె అగ్గిపుల్లల చెట్లలో నుంచి పెన్నానదిలోకి వైసీపీ నేత ఏర్పాటు చేసిన దారి, రాత్రి సమయంలో తరలిపోతున్న ఇసుక

జమ్మలమడుగు, మార్చి 24: జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణా బరితెగించి వైసీపీ కార్యకర్తలు తరలిస్తున్నారు. జమ్మలమడుగు ప్రాంతం అధికారుల అండతో అధికార పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు ఇసుక, గ్రావెల్ తరలించడమేకాక ఎక్కడ పడితే అక్కడ ఖాళీ స్థలం కనపడితే మట్టి తోలడం, రాళ్లు తోలడం చేస్తున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని పి.సుగుమంచిపల్లె గ్రామం పెద్దదండ్లూరు వెళ్లే దారిలో పెన్నానది పక్కన అగ్గిపుల్లల చెట్లలో స్థానిక వైసీపీ నేత రాళ్ల మట్టి తరలించి పెన్నానదిలోకి గులకరాళ్లు వేసి దారి చేసినట్లుగా బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికార అండతో స్థానిక అధికారులు అరికట్టలేకపోతున్నారని విమర్శలున్నాయి. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేసే సిబ్బంది, అధికారులు అన్ని ప్రాంతాల్లో పరిశీలిస్తున్నా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకోవడం లేదని బహిరంగ ఆరోపణలున్నాయి. అందులో భాగంగా పి.సుగుమంచిపల్లె గ్రామంలో ప్రతిరోజు పగలు, రాత్రి అక్రమ ఇసుక రవాణా జోరుగా ఇసుక తరలిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. పి.సుగుమంచిపల్లె వద్ద నుంచి నేరుగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కర్నూలు జిల్లాకు ఇసుక ట్రాక్టర్లు యథేచ్ఛగా తరలిపోతున్నా అధికారులకు ఇసుక ట్రాక్టర్లు కనిపించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

జగన్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదు

చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి ● మృతుల కుటుంబాలకు టీడీపీ నేతల నివాళులు



కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు , మార్చి 24 : రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదని, రెవెన్యూలో అవినీతి హద్దు మీరి పెరిగిపోయిందని నియోజకవర్గ ఎమ్మెల్యే నుంచి మండలస్థాయి వైసీపీ నాయకుల వరకు భూదందాలతో సామాన్య ప్రజలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద మృతిచెందిన చేనేత కుటుంబంకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలంలోని చేనేత కుటుంబానికి చెందిన పాల సుబ్బారావు భూమిని అక్రమంగా వైసీపీకి చెందిన నాయకులు ఆన్‌లైన్ ఎక్కించుకుని ఆక్రమించారని దీంతో మనస్తాపం చెందిన సుబ్బారావు భార్య, పిల్లలతో ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమన్నారు. ప్రొద్దుటూరులో ఇలాంటి భూ అక్రమాలకు ఇక్కడి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పాల్పడి వేల కోట్లు అక్రమంగా సంపాదించాడన్నారు. ప్రముఖవైద్యుడు స్వరూప్ కుమార్‌రెడ్డి ఇంటిని అక్రమంగా వేరే వారిపేర రిజిష్టర్ ఎలా చేయించారన్నారు. చిన్నశెట్టిపల్లె వద్ద శనగల గోడౌన్ యజమాని చనిపోతే ఆపంచాయితీ పరిష్కరిస్తానని చెప్పి గోడౌన్ సహా 13 ఎకరాలు భూమి ఎమ్మెల్యే రాచమల్లు అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడన్నారు. బాధిత రైతులకు ఇవ్వాల్సిన మూడు కోట్లు ఇవ్వకుండా ఇప్పటికీ ఎమ్మెల్యే వేధిస్తున్నాడన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ,నంద్యాల కొండారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు మాజీ ఎంపీపీ గురివిరెడ్డి చీమల రాజశేఖర్, జీసీపుల్లయ్య, ధనియాల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు





ప్రొద్దుటూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం, మైదుకూరులో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 24: పట్టణంలోని వివిధ చర్చిలలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. గోకుల్‌నగర్ ఎస్పీజీ చర్చిలో పాస్టర్ రెవరెండ్ కోలాటి రాజు మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. క్రైస్తవులు ఈతమట్టలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. రామేశ్వరం సీఐఎస్ఐ చర్చిలో ఈతమట్టలతో ఊరేగింపు నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ భాస్కర్ యాకోబ్ ప్రాంక్ దేవుని వాక్యాన్ని వినిపించారు. ప్రార్థనలలో క్రైస్తవులు పాల్గొన్నారు. మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ-1, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3, గోల్డెన్‌జూబ్లీ, ఆర్‌సీఎం చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.

బద్వేలు..: సీఎస్ఐ సెయింట్ పాల్ పట్టణ ఆలయంలో ఆదివారం మట్టల ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సంఘ కాపరీడీనరి చైర్మన్ రెవరెండ్ ఎంఎఫ్ఎస్. ఆనందకుమార్ ఆరాధన కార్యక్రమాన్ని భక్తి,శ్రద్ధలతో ప్రార్థన ద్వారా నిర్వహించిన స్థానిక సంఘ కాపరీ ప్రెస్బిటర్ స్వరాజ్ జీవన్‌బాబు మాట్లాడారు.ఈ ఆరాధన కార్యక్రమంలో పాస్టేట్ కమిటీ పరిపాలన విభాగపు సెక్రటరీ కె.ఎడ్వర్డ్, ట్రెజరర్ మూరతోటి సునీల్‌కుమార్, యూత్ కౌన్సిల్ మెంబర్ జ్యోతి, సిరంగి,దేవానందం, సుజాత తదితరులు పాల్గొన్నారు

కొండాపురం..: సీయంఆర్ కాలనీలోని సీఎస్ఐ చర్చి వద్ద మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం రోజును క్రైస్తవులు మట్టల ఆదివారంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఈత మట్టలు చేతులో పట్టుకొని చర్చి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘ గురువు డివిజనల్ చైర్మెన్ రెవరెండ్ దానమయ్య, సంఘ సెక్రటరీ బి.జోసఫ్, సంఘ పెద్దలు యం.మనోహర్‌బాబు, విజయరాజు ,సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: మైదుకూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ చర్చిలలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహిం చారు. శాంతినగర్, క్రిష్టాపురంలోని సీయస్ఐ చర్చి గురువులు పీఎస్ వినయ్‌కుమార్, టి అర్నిష్‌రాజ్ బాబు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు మట్టలు చేతబట్టి చర్చితో పాటు గ్రామంలో ప్రదర్శలు చేశారు.

పెద్దదండ్లూరులో తాగునీటి కటకట



జమ్మలమడుగు, మార్చి 24: జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామంలో మంచినీటి సమస్య ఉంది. పెద్దదండ్లూరు గ్రామంలో కొంత కాలం నుంచి గ్రామంలో సరఫరా చేసే నీరు జపుకులుగా మారి ప్రజలకు మంచినీరు తాగడానికి లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యను స్థానిక గ్రామ పంచాయతీవారు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమస్య తెలియజేసినట్లు గ్రామ పంచాయతీలోని ప్రజలు తదితరులు తెలిపారు. అయితే ప్రస్తుతం పెద్దదండ్లూరు గ్రామ నుంచి పి.సుగుమంచిపల్లెకు వెళ్లే దారిలో శ్రీరాముని దేవాలయం వద్దకు సుమారు కిలోమీటరు దూరం ద్విచక్ర వాహనంలో వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో సరఫరా చేసే నీరు తాగడానికి పనికిరావని ద్విచక్ర వాహనాల్లో వెళ్లి నీళ్లను తెచ్చుకుంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మంచినీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు తెలిపారు.

కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలి

● బీటెక్ రవికి ఘనస్వాగతం



చక్రాయపేట, మార్చి 24: తెలుగుదేశం కార్యకర్తలు మనో ధైర్యంతో మెలగాలని వైసీపీ నాయకులు చేసే అరాచకాలకు బెదరద్దని కార్యకర్తలకు పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. ఆయన ఆదివారం సురభి గ్రామం నాగులగుట్టపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చక్రాయపేట మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, సురభి ఉపసర్పంచు దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు గావించారు. అనంతరం బీటెక్ రవి కార్యకర్తలతో మాట్లాడుతూ స్వయానా ముఖ్యమంత్రి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని నివారించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఒక ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని చక్రాయపేటలో మహిళలు లబోదిబోమంటున్న పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. చక్రాయపేట మండలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తోలామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం నీటిని అందించలేదన్నారు. మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, బీసీ సంఘ నాయకుడు నాగేంద్రయాదవ్, మండల ఉపాధ్యక్షుడు చంద్ర, రామాంజనేయరెడ్డి, మాజీ ఉపమండలాధ్యక్షుడు నరసింహులు, యోగీశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రమేష్, పరమేశ్వర్, అమర్, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా కోట పోలేరమ్మ తిరుణాల



తిరుణాలలో భక్తుల సందడి, అమ్మవారిని అలంకరించిన దృశ్యం

పోరుమామిళ్ల, మార్చి 24 : కోట పోలేరమ్మ తిరుణాల ఘనంగా జరిగింది. ఆదివారం కోట పోలేరమ్మ తిరుణాల చివరి రోజున పోరుమామిళ్లలో బోనాలు,కుంకుమ బండ్లతో ఊరేగింపుగా అమ్మవారి దేవాలయం వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బలిజకోట, రంపాడు వీధి, తంబాబావివీధి తదితర ప్రాంతాల్లోని కుంకుమ బండ్లను ఊరేగింపుగా కోట పోలేరమ్మ దేవాలయం వద్దకు తీసుకువచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాలా మంది మహిళలు పూనకంతో భక్తిపారవశ్యంతో చిందులు వేశా రు. ఆదివారం కోట పోలేరమ్మ దేవాలయం ఆవరణమంతా పండుగలా ఉత్సవ వాతావరణం నెలకొంది.

టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు సంక్షేమ ఫలాలు



ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు

ఎర్రగుంట్ల మార్చి24:టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు సంక్షేమ ఫలాలు అందుతాయని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి తల్లి సరస్వతమ్మ, భార్య జ్యోతి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని 13,14 వార్డుల్లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. టీడీపీ ఎర్రగుంట్ల ఇన్‌చార్జి జయరామిరెడ్డి, సూరి, రామసుబ్బయ్య టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నంగనూరుపల్లె నాగేశం

ప్రొద్దుటూరు , మార్చి 24 : వైసీపీ మునిగిపోయే నావ అని ఇక ఆపార్టీలో ఎవ్వరూ ఉండరని త్వరలో ఆపార్టీ ఖాళీ అవుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నంగనూరు పల్లెలోని వైసీపీ నాయకుడు నాగేశం తోపాటు 100 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు మాజీ ఎంపీపీ లక్ష్మీపేట గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే రాబోవు ఎన్నికల్లో తమ ఓటును ఏ విధంగా ఓటు వేయాలని సైబర్ నేరగాళ్లతో ఎలా ఉండాలని, బ్యాంకు లావాదేవీలపై పిల్లల పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై మండలంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక క్యాంపును నరసన్నపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాధవ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో- ఆర్డినేటరు కిరణ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇనుప వంతెన తరలింపు..!



టంగుటూరు వద్ద కుందూలో ఉన్న ఇనుప వంతెనను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, మార్చి 24 : మండల పరిధిలోని టంగుటూరు పాత బ్రిడ్జిపై ఉన్న ఇనుప వంతెన గతంలో కుందూలో పడిపోయింది. తర్వాత కుందులో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోవడంతో ఆ వంతెనను గ్యాస్ కట్టర్‌లతో కట్ చేసి ఎక్స్‌కవేటర్‌తో తరలిస్తుండడంతో గ్రామ ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలిలా.. 2009లో టంగుటూరు వద్ద కుందూ నదికి ఉన్న పాత బ్రిడ్జి పిల్లర్ కూలిపోయింది. దీంతో తాత్కాలిక మరమ్మతుల కోసం పది లక్షలతో టెండర్లు పిలిచి పిల్లర్‌కు మూడున్నరలక్షలతో ఇనుప పిల్లర్ దాదాపు ఐదుటన్నులతో తయారు చేయించారు. కాగా ఆరున్నర లక్ష రూపాయలతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. అయితే కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఆ బ్రిడ్జిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. 2019లో భారీ వరదలు రావడంతో పాత బ్రిడ్జిపై ఉన్న ఐదుటన్నుల ఇనుప వంతెన కుందూలోకి పడిపోయింది. అప్పటి నుంచి నీటి ప్రవాహం ఉండడంతో ఆ వంతెన తీసేందుకు సాధ్యం కాలేదు. ప్రస్తుతం కుందూలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గడంతో ఆదివారం గ్యాస్ కట్టర్‌లు, ఎక్స్‌కవేటర్ల ద్వారా నాలుగు భాగాలుగా విభజించి కట్ చేసి వాటిని తరలిస్తున్నారు. కుందూలో గ్యాస్ కట్టర్ల ద్వారా వంతెన కట్ చేస్తుండడంతో ఆ గ్రామ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల రోడ్డును పట్టించుకోని అధికారులు ఇనుప వంతెన కట్ చేసి త్వరత్వరగా తరలిస్తుండడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది. ఏదిఏమైనా ఉన్నతాధి కారులు చొరవ తీసుకుని వీటిని వేలం ద్వారా అమ్మి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా, పెద్ద వంతెనను కట్ చేసి ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీకి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పుట్టా ఆధ్వర్యంలో టీడీపీలోకి భారీగా చేరికలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 : బ్రహ్మంగారిమఠం మండలంలోని ఎన్.గొల్లపల్లె ఓసీ కాలనీలో కొరపాటి లక్ష్మీనాయుడు, భీమానాయుడు, శ్రీనివాసులునాయుడు, చిన్నక్రిష్ణ, బాలచెన్నయ్య, స్వామిదాసు, సిద్ధం నరసింహులు, నాగేశ్వర్‌రావు, పెంచలయ్య, చెన్నక్రిష్ణయ్య, ఓసీ కాలనీలో వాకమల్ల ఓబుల్‌రెడ్డి, కొరపాటి వెంకటేశ్వర్ నాయుడు, కొరపాటి శ్రీనివాసులునాయుడు, లక్ష్మినాయుడు, సుబ్బారెడ్డి, శివానందరెడ్డి, సాంబయ్య, శివ, రామప్రసాద్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఈశ్వరయ్య, రామయ్య, నాగిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, ఎన్.గొల్లపల్లె ఓసీ కాలనీలో 20 కుటుంబాలు, ఎస్సీ కాలనీలో 80 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో చేరాయి. అదే విధంగా చౌదరివారిపల్లె గ్రామంలో 60 కుటుంబాలు ప్రొద్దుటూరు లోని పుట్టా నివాసంలో ఆయన సమక్షంలో చేరారు. అనంతరం ఎన్.గొల్లపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుట్టా మాట్లాడుతూ ఒక్కసారి ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, జనరల్ సెక్రటరీ ముద్దుక్రిష్ణమనాయుడు, కేవీఎస్ నాయుడు, ఎక్స్ ఎంపీటీసీ రమేష్, సుధాకర్, టీడీపీ జిల్లా కార్యదర్శి బసిరెడ్డి పోలిరెడ్డి వెంకటేష్ నాయుడు, శ్రీనివాసులునాయుడు, భీంనాయుడు, కొరపాటిలక్ష్మీనాయుడు, శివయాదవ్, చిన్నిక్రిష్ణ, యూత్ అధ్యక్షుడు బైపాడు సుమన్, గురయ్య యాదవ్, నాగేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మాజీ కౌన్సిలర్‌తో పాటు పలువురు టీడీపీలోకి చేరిక

మైదుకూరు, మార్చి24 : వైసీపీ ప్రభుత్వంపై విసిగెత్తి పలువురు నాయకులు టీడీపీలో చేరుతున్నారు. తాజాగా పట్టణంలోని వైసీపీకి చెందిన 15వ వార్డు మాజీ కౌన్సిలర్ చెంచు రామయ్య, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ బీపీ వెంకట రమణారెడ్డి వారు అనుచరులు దాదాపు 30 కుటుంబాల వారు ఆదివారం ప్రొద్దుటూరులోని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ నివాసానికి చేరుకొని టీడీపీ కండువాలు వేయించుకున్నారు. అలాగే మండలంలోని లెక్కలవారిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు హేమానాయక్, బాలాజీ,బాలా, రాముడు, శివ నాయక్‌లతో పాటు వారి వర్గీయులు టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు భీమయ్య, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్, కటారు క్రిష్ణ, బీపీ సుధాకరరెడ్డి, బీయన్ శ్రీనివాసులు, రామచంద్ర నాయుడు, జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బ్రహ్మంగారి మఠం... ఎన్.గొల్లపల్లె టీడీపీలో చేరిన ఓసీ, ఎస్సీ కాలనీ వైసీపీ నేతలు